నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు


పాలకొల్లు అర్బన్: లంకలకోడేరు పోలియో శిబిరం వద్ద గుడాల శ్రీహరి గోపాలరావు


మొగల్తూరు: దారితిప్పలో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాపూజీ


యలమంచిలి: పీహెచ్‌సీలో పిల్లలకు పోలియో డ్రాప్స్ వేస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ

పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన నాయకులు

నరసాపురం: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అవసరమని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం పార్కురోడ్డులోని కొప్పర్తి వేణుగోపాల్ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో మహమ్మారిని మనదేశం నుంచి పూర్తిగా తరమికొట్టామన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా ఇస్తున్న పోలియో చుక్కలను తప్పక ఇప్పించాలని చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మాట్లాడుతూ పట్టణంలో పోలియో చుక్కలు వేయడానికి 40 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు అర్బన్: చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో మేలు చేస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు పీహెచ్‌సీ ఆవరణలోనూ, అలాగే పట్టణంలోని 9వ వార్డు అర్బన్ హెల్త్ సెంటర్‌లోనూ ఆదివారం గోపి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడంలో తల్లిదండ్రులు అశ్రద్ధ చేయకూడదన్నారు. అలాగే నెలవారీ వాక్సినేషన్ కూడా క్రమం తప్పకుండా ఇప్పించాలని కోరారు. లంకలకోడేరులో 35 బూత్‌లో 3535 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 3435 మందికి పైగా పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారికి 4,5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయనున్నట్లు మెడికల్ ఆఫీసర్ డా.అద్దాల ప్రతాప్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ చంటిరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు రక్షగా నిలుస్తాయని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం సిద్ధాంతం నక్కావారి పాలెంలో చిన్నారికి శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్రలతో కలసి చిన్నారికి పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా చేపటిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని దారితిప్ప గ్రామంలో ఆయన ప్రారంభించారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పడవల మేరీ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలోని 0 నుంచి 5 సంవత్సరాలలోపు గల చిన్నారులు 5531 మంది ఉండగా 5397 మందికి (97.6) శాతం మందికి పోలియో చుక్కలు వేశామని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ దినేష్ తెలిపారు. మండలంలో సుమారు 53 బూత్‌లు, 1 మొబైల్ టీమ్, ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఒక ట్రాన్సిట్ టీమ్ ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన చిన్నారులకు 4, 5వ తేదీలలో తమ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: పోలియో రహిత సమాజం కోసం ప్రతి చిన్నారికీ విధిగా పోలియో వ్యాక్సిన్ ఇప్పించాలని ఎంపీడీఓ రమణరావు, సీతారామపురం సర్పంచ్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని సీతారామపురం సౌత్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన పోలియో వ్యాక్సిన్ కార్యక్రమంలో వారు పాల్గొని చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నల్లి జయవరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చింతపల్లి రవి, ఏఎన్ఎం దుర్గా లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు పట్టణంలో..

పాలకొల్లు సెంట్రల్: పోలియో నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షులు పెనుమాక రామ్మోహనరావు అన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేశారు. ఈ సందర్భంగా పోలియో అర్బన్ నోడల్ అధికారి డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో బస్టాండ్, రైల్వే స్టేషన్, టిడ్కో గృహాల వద్ద కలిపి మొత్తం 35 పోలియో డ్రాప్స్ సెంటర్లు, ఒక మొబైల్ వ్యాన్ ఏర్పాటు చేశామన్నారు. పాలకొల్లు పట్టణంలో మొత్తం పుట్టిన బిడ్డ 0 నుండి 5 ఏళ్ల లోపు వయస్సు కలిగిన చిన్నారులు 6,995 మంది ఉన్నారన్నారు. వీరిలో 6,470 మందికి డ్రాప్స్ వేశామని అన్నారు. దాత కేవీ కృష్ణవర్మ మెడికల్ సిబ్బంది 150 మందికి ఫుడ్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ రావాడ సతీష్, చందక రాము, మద్దాల వాసు, కావలి నగేష్, గన్నాబత్తుల శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్, పోతాబత్తుల సత్యనారాయణ, మెడికల్ అధికారి భావన తదితరులు పాల్గొన్నారు.

పెనుమంత్రలో...

పెనుమంత్ర: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో 98 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు. ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, పెనుమంత్రలో గ్రామసర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఎంపీటీసీ సభ్యురాలు మంగాదేవి, వెలగలేరు గ్రామంలో విద్య, మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి, మార్టేరులో పీహెచ్‌సీ వద్ద గ్రామసర్పంచ్ మట్టాకు మారి, బస్‌స్టేషన్ సెంటర్‌లో ఎంపీటీసీ సభ్యురాలు కర్రి అనురాధ, నెగ్గిపూడిలో సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కరరెడ్డి పల్స్ పోలియో కార్యక్రమాలను ప్రారంభించారు. పెనుమంత్ర పీహెచ్‌సీలో 3018 మంది పిల్లలకు ఆలమూరు పీహెచ్‌సీ పరిధిలో 1476 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఆయా అధికారులు తెలిపారు.

పెనుమంత్ర పీహెచ్‌సీ సందర్శన

పెనుమంత్ర పీహెచ్‌సీని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పల్స్‌పోలియో నూరు శాతం పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు.

పోలియో రహిత సమాజానికి కృషి

యలమంచిలి: పోలియో రహిత సమాజ నిర్మాణానికి మనమంతా ఒక్కటై కృషి చేద్దామని ఎంపీపీ రావూరి వెంకటరమణ కోరారు. సామూహిక పోలియో నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరిగిన పోలియో వ్యాక్సినేషన్లో ఆమె యలమంచిలిలో పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. యలమంచిలి పీహెచ్‌సీ పరిధిలో 3725 మంది పిల్లలు ఉండగా 95 శాతంతో 3537 మంది పిల్లలకు, మేడపాడు పీహెచ్‌సీ పరిధిలో 3885 మంది పిల్లలు ఉండగా 95 శాతంతో 3645 మంది పిల్లలకు, దొడ్డిపట్ల పీహెచ్ సీ పరిధిలో 3325 మంది పిల్లలు ఉండగా 96 శాతంతో 3192 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమాన్ని మూడు పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ కె ప్రభాకరరెడ్డి, డాక్టర్ కె చంద్రరేఖలు పర్యవేక్షించారు.


నరసాపురం రూరల్: సీతారామపురం హైస్కూల్‌లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


మొగల్తూరు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ పడవల మేరీ


పెనుమంత్ర: ఆసుపత్రిలో పల్స్ పోలియో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా మహేశ్వరరావు


పాలకొల్లు సెంట్రల్: చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, డాక్టర్ ప్రతాప్

క్లుప్తంగా

నేడు 24వ వార్డులో జగనన్నతో జనం-గోపన్నతో మనం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 24వ వార్డులో సోమవారం ఉదయం 8 గంటలకు జగనన్నతో జనం-గోపన్నతో మనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఈ-క్రాప్ జాబితా సరిచూసుకోవాలి


అబ్దుల్ రహీమ్

మొగల్తూరు: ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్న ఈ-క్రాప్ జాబితాను సరిచూసుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సాగు చేస్తున్న రైతుల పేర్లు, సాగు విస్తీర్ణం, పంట వివరాలను ఆర్‌బీకేలోని నోటీస్ బోర్డులో ఉంచామని, రైతులు పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే మంగళవారం లోపు తెలియపర్చాలని సూచించారు. దాళ్వా ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా రైతులు జాగ్రత్తపడాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా ఏసురాజు


పెన్మెత్స ఏసురాజు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వడ్లవానిపాలెం గ్రామానికి చెందిన పెన్మెత్స ఏసురాజును వైఎస్సార్ సీపీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నియమించారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏసురాజును మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదివారం విలేకరులకు తెలిపారు. ఏసురాజు ప్రస్తుతం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం


గుడాల గోపికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెలివెల పెదపేట, చినపేట యువజనులు

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సూచించారు. మండలంలోని వెలివెల పెదపేట, చినపేటలోని 5 0కుటుంబాలకు చెందిన యువజనులు ఆదివారం గుడాల గోపిని కలిశారు. సీఎం జగన్‌ని మరలా సీఎం చేసుకోవడానికి మేము సిద్ధం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గోపి పలు సూచనలు చేశారు. పార్టీకి అండగా ఉండాలన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ముందు నిలబడతానన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి యువకులంతా బాధ్యతగా పనిచేయాలన్నారు. పాలపర్తి సంతోషరావు, తోకట నాగేశ్వరరావు, గల్లి వెంకటరత్నం, గునుపూడి సతీష్ బాబు, పెదపాటి సతీష్‌బాబు, తోకట సూర్యచంద్ర, మట్టా మునలయ్య, కారేపల్లి సునీల్ పాల్గొన్నారు.

పన్ను బకాయిల చెల్లింపులపై వడ్డీ రాయితీ

తణుకు అర్బన్: 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇంటి, ఖాళీ స్థలం పన్ను బకాయిలతో పాటు కుళాయి ఛార్జీల బకాయిలు ఏక మొత్తంగా ఈనెల 31వ తేదీలోపు చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించినట్లు తణుకు మునిసిపల్ కమిషనర్ బీవీ రమణ తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెలలో సెలవు రోజుల్లో సైతం మునిసిపల్ కార్యాలయం, సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

అలరించిన పంచరత్న కీర్తనలు


పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సద్గురు త్యాగరాజ స్వామి 83వ ఆరాధనోత్సవాల సందర్భంగా త్యాగరాజ గాన సభ ఆధ్వర్యంలో స్థానిక బీవీ ఆర్ కళా కేంద్రంలో అమ్మనమంచి బలరామ శాస్త్రి కళావేదికపై ఆదివారం రాత్రి సంగీత విద్వాంసులతో పంచరత్న కీర్తనలు గానం చేశారు. బుద్ధాల వెంకటరామారావు, గరికపాటి బాపయ్య శర్మ, సంగీత విద్వాంసులు, కళాకారులు, బీవీఆర్ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులకు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా దర్శనానికి వచ్చిన బాలలకు పోలియో చుక్కలు వేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హామీలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీదే

నరసాపురం రూరల్: ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ 99 శాతం నెరవేర్చారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని లిఖితపూడి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో రూ.47.3 లక్షలతో నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంకు, రక్షిత మంచినీటి సరఫరా అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. గ్రామంలో పేదల కోసం నిర్మించే గృహాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను అర్హులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్క చెల్లెమ్మలకు సెంటున్నర స్థలం రిజిస్ట్రేషన్ చేయించి సర్వహక్కులు కల్పిస్తూ సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నారని అన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో ఒక్క లిఖితపూడి గ్రామంలో సంక్షేమం కోసం రూ.13కోట్లు, అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. గ్రామంలో ప్రారంభించిన రైతు భరోసా కేంద్రంతో నియోజకవర్గంలో 100 శాతం రైతు భరోసా కేంద్రాలను నిర్మించామని వివరించారు. అనంతరం అర్హులైన 65 మందికి జగనన్న కాలనీల రిజిస్ట్రేషన్ దస్తావేజులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోని, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నం వెంకట్రావు, చొప్పల జ్ఞాన ప్రకాష్, పితాని మురళీ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


లిఖితపూడిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

దుస్తుల పంపిణీ

నరసాపురం: రోటరీ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం స్టీమర్ రోడ్డులో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముదునూరి మాట్లాడుతూ రోటరీక్లబ్ కరోనా సమయంలో కూడా విలువైనసేవలు అందించిందని చెప్పారు. క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, క్లబ్ ప్రతినిధులు తెనాకుల విజయ్‌కుమార్, సలాది రామారావు, కౌన్సిలర్ కావలి నాని పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

పోడూరు: మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీతో కలిసి పోడూరు, గుమ్మలూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి. పోడూరు శివారు అంబటివానిచెరువులో చించినాడ పంటకాలువపై నూతనంగా నిర్మించిన వంతెనను, పోడూరు-2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని, నూతన సీసీరోడ్లు, ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌లను, గుమ్మలూరు గ్రామంలో సచివాలయం-1, సచివాలయం-2 భవనాలను, గుమ్మలూరు-1 రైతు భరోసా కేంద్రాన్ని, పైడావలో నూతన వంతెనను ప్రారంభించనున్నారు.

సచివాలయ వ్యవస్థతో పారదర్శకమైన పాలన


కవిటంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: సచివాలయ, వలంటరీ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకమైన పరిపాలన అందిస్తున్నారని మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కవిటం గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన సచివాలయం-1, సచివాలయం-2 భవనాలను, రైతు భరోసా కేంద్రం-1, రైతు భరోసా కేంద్రం-2 భవనాలను ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ, వలంటరీ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. అవినీతి, లంచగొండితనానికి తావులేకుండా ప్రజలను అవసరమైన అనేక ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా అందిస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, వైస్‌ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, సర్పంచ్ చుట్టుగుల్ల పూర్ణిమ, సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పడాల సత్యనారాయణరెడ్డి, అంబళ్ల భాస్కరరావు, సత్తి మురళీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కుక్కల సూరిబాబు, ఉప సర్పంచ్ పోతంశెట్టి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 మందికి ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచితవైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకులోని వివిధ ప్రాంతాల్లోని 9 మంది వృద్ధులకు ఇంటి వద్దనే వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగు ఆరోగ్య సూచనలు, సలహాలను అందించారు. అసోసియేషన్ సభ్యుడు పాతూరి శివన్నారాయణ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాధమ్మ, నిర్వాహకురాలు చిట్టూరి సుజాత, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

గోపి విజయానికి పూర్తి సహకారం


మాజీ ఎమ్మెల్యే బాబ్జితో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న గుడాల శ్రీహరిగోపాలరావు(గోపి) విజయానికి పూర్తిగా సహకరిస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) హామీ ఇచ్చారు. పాలకొల్లులో ఆదివారం డాక్టర్ బాబ్జిని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. గోపి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కష్టపడుతున్నారన్నారు. పార్టీలోని కేడర్‌ని కలుపుకుని సమస్యల పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తున్నారని కితాబిచ్చారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కలిసి పని చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించారన్నారు. వై నాట్ 175 లక్ష్యానికు అనుగుణంగా పార్టీలోని ముఖ్యనేతలంతా కష్టించి పని చేస్తున్నారని ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తెలిపారు.

వైభవంగా కోదండరాముని కల్యాణోత్సవం


ఒంటిమిట్ట కోదండ రాముని కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార ప్రరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా బలుసులమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ఒంటిమిట్ట కోదండ రాముని కల్యాణాన్ని నిర్వహించారు. కొట్టు విశాల్ పాల్గొని పూజలు నిర్వహించారు. కోదండరాముని కల్యాణం అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.